సాక్షి

వికారాబాద్

గురువారం : 28 : సెప్టెంబర్ : 2023



పౌష్టికాహారంతో బ్రేక్‌ఫాస్ట్

పస్తులతో పాఠశాలలకొచ్చే పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అల్పహారం అందించాలని నిర్ణయించింది. 8లో▸



ఆరేళ్లయినా.. అక్కడే!

అభివృద్ధి పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. పాలకుల హామీలకే పరిమితమయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



రోడ్లు ఛిద్రం..

నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షాలతో రోడ్లు మరింత ధ్వంసం అవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే యాదయ్య



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.4కోట్ల 50లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, పంచాయతీ భవన నిర్మాణం వంటి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ జయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీటీసీ దయాకర్ రెడ్డి, సర్పంచ్‌లు రత్నం, పద్మ, అంజయ్య, కిష్టయ్య, సుభాన్ రెడ్డి, అజయ్‌కుమార్, రత్నం, బల్వంత్ రెడ్డి, పరమయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం: డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

దౌల్తాబాద్: శాంతి భద్రతల పట్ల పోలీసులు సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన దౌల్తాబాద్ పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఎస్‌ఐ, సిబ్బంది పనితీరును అభినందించారు. మండలం కర్ణాటకకు సరిహద్దున ఉన్నందున నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సీఐ రాములు, ఎస్‌ఐ రమేశ్‌కుమార్ తదితరులున్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పరిగి: ముదిరాజ్‌లు సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఏ పార్టీలో ఉన్నా సమస్యలు వచ్చినప్పుడు అందరూ కలసికట్టుగా పోరాటం చేయాలని సూచించారు. అక్టోబర్ 1న పరిగి పట్టణ కేంద్రంలో పండుగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీలకతీతంగా ముదిరాజ్‌లందరూ హాజరుకావాలని సూచించారు. ముందుగా కొడంగల్ చౌరస్తా నుంచి విగ్రహావిష్కరణ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, రాంచంద్రయ్య, రాష్ట్ర నాయకులు హన్మంతుముదిరాజ్, రామస్వామి, నగేశ్, శ్రీను, డాక్టర్ జగన్మోహన్ పాల్గొన్నారు.

చలో హైదరబాద్‌కు తరలిరండి

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం



కమిషనర్‌కు నోటీసు ఇస్తున్న కార్మికులు

వికారాబాద్ అర్బన్: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో అక్టోబర్ 3న నిర్వహించే 'చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు సీఐటీయూ నాయకులు మహిపాల్, చిన్నయ్య, కార్మికులు.. సమ్మె నోటీసు ఇచ్చారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులు.. బుచ్చయ్య, శంకర్, రాజు, విజయలక్ష్మి, అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ నమోదు చేస్తున్న రేషన్ డీలర్

రేషన్‌కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ చేసుకోవాలి

- చేయించుకోని వారిపేర్లు కార్డు నుంచి తొలగింపు
- జిల్లాలో ముమ్మరంగా నమోదు ప్రక్రియ
- డిసెంబర్ 30 తుది గడువు: జిల్లా పౌరసఫరా శాఖ అధికారి రాజేశ్వర్

పరిగి: రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతిఒక్క లబ్ధిదారుడి వివరాలను సరిచూసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. కేవైసీని ఆగస్టులోనే ప్రారంభించాలని అనుకున్నప్పటికీ కొన్ని కారణాల వల్ల ఈనెల(సెప్టెంబర్) నుంచి రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ నమోదును ప్రారంభించారు. రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి లబ్ధిదారుడు వ్యక్తగతంగా రేషన్ దుకాణానికి వెళ్లి తప్పనిసరిగా ఈపాస్ యంత్రంలో వేలిముద్రను వేసి ఈకేవైసీ చేయించుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా మొదటి దశ నుంచి ఇప్పటివరకు రేషన్ కార్డుదారులందరికీ ప్రతినెలా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి రేషన్ కార్డులో నమోదైన సభ్యుల పేరిటే రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డులోని కుటుంబ సభ్యుల్లో కొందరు మృతిచెందిన వారు, పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిన వారు, కుమారులు పెళ్లి చేసుకుని ఉద్యోగం, ఇతర రాష్ట్రాల్లో ఉపాధికి వెళ్లిన వారు ఉన్నా వారికి కూడా ఇప్పటికీ అలాగే రేషన్ కొనసాగుతోంది. ఈకేవైసీ చేయడం ద్వారా ఆయా పేర్లను తొలగించేందుకు అవకాశం ఉంది. అందులో భాగంగానే రాష్ట్ర పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి ఈ కేవైసీని ప్రారంభించారు. ఈ ప్రక్రియ మూడు నెలలపాటు కొనసాగనుంది.

అందరికీ తప్పనిసరి..

జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో మొత్తం 588 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మొత్తం 2లక్షల 41వేల రేషన్ కార్డులు, 8లక్షల 10వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. రేషన్ కార్డులో పేరు ఉన్న కుటుంబ సభ్యులంతా రేషన్ దుకాణానికి ఈకేవైసీ కోసం వెళ్లి వేలిముద్రలను వేయాలి. వేలిముద్ర వేయగానే రేషన్‌కార్డునంబర్‌తో పాటు సభ్యుల ఆధార్ నంబర్ చూపిస్తుంది. వీటిని సరిచూసుకున్న తర్వాత ఆకుపచ్చ రంగు వెలిగి సదరు సభ్యుల ఈకేవైసీ పూర్తవుతుంది. ఒక వేళ ఈపాస్ యంత్రంలో ఎరుపురంగు వెలిగితే సదరు వినియోగదారుడి రేషన్ కార్డు ఆధార్ సరిపోల్చలేమంటూ రిజెక్ట్ సూచిస్తుంది. ఈ ప్రక్రియలో గైర్హాజరైన యూనిట్ల వివరాలు ఈ పాస్ యంత్రంలో నమోదవుతాయి. ఆ తర్వాత ఆయా యూనిట్లను తొలగిస్తారు.

లేకుంటే రేషన్ కట్..

రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ గడువులోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాల్సి ఉంటుంది. ఈకేవైసీ కోసం సమీప రేషన్ దుకాణానికి వెళ్లి ఈపాస్ యంత్రంలో వేలిముద్రలను వేయాల్సి ఉంటంది. ఒకవేళ ఈకేవైసీ చేసుకోకుంటే వారికి రేషన్ కట్ అవుంది. ఒక కార్డులో 5 మంది ఉంటే.. అందరూ రేషన్ దుకాణంలో ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంటుంది. అందులో ఒకరు ఈకేవైసీ చేయించుకోకుంటే ఒక్కరి రేషన్ తొలగి నలుగురికి రేషన్ వస్తుంది.

డిసెంబర్ 30 తుదిగడువు



రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి సభ్యుడు డిసెంబర్ 30 వరకు ఈకేవైసీ చేసుకోవాలి. ఒకవేళ అప్పటివరకు ఎవరైనా చేసుకోకుంటే గడువు మళ్లీ పొడిగించే అవకాశం ఉంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లాలో మెజార్టీ రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది.

– రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

చిరస్మరణీయుడు 'కొండా'

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తొలి, మలి దశలో పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయుడని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర ఉద్యమాలతో పాటు నిజాం సర్కార్ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ తొలి, మలి దశలో ప్రజలను సమీకరించి ఉద్యమించిన నాయకుడని కొనియాడారు. ఆయన కలలను సహకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ సన్నధులు కావాలని ఆకాంక్షించారు. మాజీ విద్యా మౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ నాగేంద్ర గౌడ్, ఎంపీపీ చంద్రకళ, పద్మశాలి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనంతగిరి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ తొలి ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ కోటిరెడ్డి కోరారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, ఏఓ జ్యోతిర్మని, జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ హనుమంతరావు, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు రాజు, ప్రమీల, రవి, శ్రీను, ఎస్‌ఐలు, డీపీఓ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న తాండూరు మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం

వలస నేతలను తరిమికొడదాం

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: తాండూరు అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థులు కరువయ్యారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విమర్శించారు. దీంతో నాల్‌లోకల్ అభ్యర్థులు తాండూరులో రాజకీయాలు చేస్తున్నారన్నారు. అలాంటి వలస నేతలను తాండూరు ప్రజలు తరిమికొడతారన్నారు. తాండూరు నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం మంత్రులు హరీశ్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. రూ.25 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.10.23 కోట్లతో నూతన మార్కెట్ యార్డుకు భూమి పూజ, రూ.1.50 కోట్లతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన, తాండూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం, మాతా శిశు ఆస్పత్రిలో రూ.50 లక్షలతో నిర్మించిన బర్త్ వెయిటింగ్ హాల్‌ను వారు ప్రారంభించారు. అనంతరం తాండూరు మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ వీణ, వైస్ చైర్మన్ ఉమాశంకర్‌తో పాటు 16 మంది సభ్యులకు పదవీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు హాజరయ్యారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: సీఎం సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.26 కోట్లతో నిర్మించనున్న పాలిటెక్నిక్ కళాశాల భవనం, రూ.10 లక్షలతో చేపట్టే కార్మిక భవనం, రూ.15 లక్షలతో కురుమ సంఘం భవనం, రూ.1.20 కోట్లతో నిర్మించే జూనియర్ కళాశాల భవనం, రూ.కోటితో ఉప్పుగడ్డ తండాలో నిర్మించే సేవాలాల్ దేవాలయం వద్ద మండపం, రూ.90 లక్షల నిధులతో వీరశైవ లింగాయత్, గాండ్ల సంఘం, ఆర్యవైశ్య సంఘం, మున్నూరుకాపు సంఘం, ఆరె కటిక, బుడగజంగాల, గంగపుత్ర సంఘం పద్మశాలి కుల సంఘాలకు నిర్మించే ఆత్మగౌరవ భవనాలకు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్ఫూర్తితో నియోజకవర్గంలో అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పల్లె ప్రగతితో గ్రామాల్లో సమూల మార్పులు వచ్చాయని, స్వచ్ఛతకు నిలయాలుగా మారాయన్నారు. మన తెలంగాణ పల్లెలకు జాతీయ స్థాయిలో అవార్డులు రావటమే అందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకండి

మహేశ్వరం: నియోజకవర్గంలో కొనసాగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకాలని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రూ. 21.67 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, కచ్చామోరీల నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. జల్‌పల్లి కమాన్ వద్ద అర్బన్ ఫారెస్ట్ పార్కులో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీలో గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో వందలాది కోట్ల రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

'వెనుకబాటు'కు ఆ పార్టీలే కారణం

- దేశాభివృద్ధిని అడ్డుకునేవి బీజేపీ, కాంగ్రెస్‌లే..
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో 76 శాతం ప్రసవాలు
- ప్రగతి ప్రస్తావన సభలో మంత్రి హరీశ్‌రావు
- సభకు పదేపదే అడ్డుతగిలిన అంగన్‌వాడీలు



సభలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

తాండూరు: దేశం వెనుకబాటుతనానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే కారణమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. తాండూరు పట్టణంలోని విలియంమూన్ స్కూల్ మైదానంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి ప్రస్తావన సభలో మంత్రులు హరీశ్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. సుమారు 20వేల మంది జనాలతో జరిగిన సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశాభివృద్ధిని అడ్డుకునేవి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో 60 ఏళ్ల అధికారంలో ఉందని, బీజేపీ 15 ఏళ్లుగా అధికారంలో ఉందన్నారు. దేశ వెనుకబాటుకు ఏ–1గా కాంగ్రెస్, ఏ–2గా బీజేపీ కారణమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోసంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో 76 శాతం ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఏకంగా 83 శాతం ప్రసవాలతో రికార్డు సృష్టించామన్నారు. జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత మెరుగు పర్చేందుకు త్వరలో ఎంఆర్‌ఐ, సీటీ స్కానింగ్ యంత్రాలను మంజూరుచేస్తానని తెలిపారు. కాగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి.. కోట్‌పల్లి ప్రాజెక్ట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరగా.. ప్రాజెక్టు అభివృద్ధికి రూ.40 కోట్లను త్వరలో మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రసంగానికి అడ్డుతగిలిన అంగన్‌వాడీలు..

ప్రగతి ప్రస్తావన సభకు వచ్చిన మంత్రి హరీశ్‌రావును కలిసి తమగోడు వెళ్లబోసుకోవాలనుకున్న అంగన్‌వాడీలకు నిరాశే మిగిలింది. నిరసనను ముందే పసిగట్టిన పోలీసులు బుధవారం ఉదయమే కీలకంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లను, సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు. దీంతో సభకు చేరుకున్న అంగన్‌వాడీలు పదేపదే సభకు ఆటంకం కలిగించారు. మంత్రి హరీశ్‌రావు ప్రసంగం మొదలుపెట్టగానే ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మంత్రి వారికి సముదాయించే ప్రయత్నం చేసినా వారు వినలేదు. ఈ క్రమంలో కొందరు అంగన్‌వాడీ సిబ్బంది బారికేడ్లను తొలగించి సభా వేదికలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సభ అనంతరం అంగన్‌వాడీలు మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని తప్పించి కాన్వాయ్ ముందుకు పంపించారు. అయితే సభలో న్యూసెన్స్ సృష్టించారని పలువురు పరిగి, వికారాబాద్ ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులపై పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసులు నమోదు చేశారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- విధుల్లో 200మంది మున్సిపల్ సిబ్బంది
- 80 మంది పోలీసులతో బందోబస్తు
- మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్



శోభాయాత్ర రూట్లను పరిశీలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వికారాబాద్ అర్బన్: నేడు(గురువారం) జరుగనున్న వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. శోభాయాత్ర జరిగే ప్రతి రోడ్డులో విద్యుత్ లైట్లతో పాటు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జనం రోజు పట్టణంలో 200మంది మున్సిపల్ సిబ్బంది విధుల్లో ఉంటారని.. అందులో 30మంది ఎబ్బనూరు చెరువు వద్ద ఉంటారని తెలిపారు. మున్సిపల్ పరిధిలో సుమారు 120 విగ్రహాలు ఉన్నట్లు తెలిపారు. చివరి వినాయకుడిని నిమజ్జనం చేసేంతవరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. ఎబ్బనూరు చెరువు వద్ద నిమజ్జనానికి రెండు క్రేన్లు, ఒక జేసీబీ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 10 మంది గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మున్సిపల్ ఆధ్వర్యంలో మహాశక్తి చౌరస్తా వద్ద స్వాగత వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భారీ బందోబస్తు..

వినాయక నిమజ్జనం శోభాయాత్ర యొక్క ప్రతి కదలికన సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శోభాయాత్ర ముగింపు వరకు ఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో (దాదపు 80మంది పోలీసులతో) భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డీజేలకు అనుమతి లేదని పోలీసులు మరోసారి స్పష్టం చేశారు.

సకాలంలో రావాలి...

మండపాల నుంచి వినాయకులను మధ్యాహ్నం 12 గంటలకే తీసి ప్రధాన రోడ్డులో జరిగే శోభాయాత్రకు సకాలంలో రావాలని హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సలహాదారు రమేష్‌కుమార్ సూచించారు. బుధవారం రామమందిరంలో నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో శోభాయాత్ర జరిగే ప్రధాన రూట్లను వారు పరిశీలించారు. శోభాయాత్రలో అన్నీ వినాయకులు బీజేఆర్ చౌరస్తాకు ముందుగా చేరుకొని మహాశక్తి చౌరస్తా మీదుగా ఎంఆర్‌పీ చౌరస్తా వరకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి మహాశక్తి చౌరస్తాకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి పాతగంజ్ ఆతర్వాత హనుమాన్ మందిర్ ముందు నుంచి బీజేఆర్ చౌరస్తాకు చేరుకొని రామయ్యగూడ రోడ్డులో వెళ్లి ఎబ్బనూరు చెరువులో నిమజ్జనం చేయాలన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో చికిత్స పొందుతున్న చిన్నారి మృతి

మర్పల్లి: పాముకాటుకు గురైన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం ఓతి (బీ)కి చెందిన జోగు అక్షిత (13) ఈ నెల 24న తన తల్లిదండ్రులతో కలిసి నర్సాపూర్‌లోని మేనమామ రాజరత్నం ఇంటికి వెళ్లారు. రాత్రి నిద్రకు ఉపక్రమించారు. 25న తెల్లవారు జామున చిన్నారి కుడిచేతి మనికట్టుపై కట్ల పాము కాటేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

ముగిసిన వర్క్‌షాప్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎకో టూరిజం తీసుకురావడానికి కృషి చేయాలని టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పేర్కొన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని మృగవనిలో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతాలను ప్రజలకు ఆనందాన్ని పంచే విధంగా తయారు చేసేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. టీఎస్ఎఫ్‌డీసీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎకో టూరిజం ప్రాజెక్టు మేనేజర్ కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయండి

పీఏసీఎస్ చైర్మన్ గంద్ర జగదీశ్వర్‌గౌడ్

కేశంపేట: రైతులు సొసైటీ అభివృద్ధికి సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ గంద్ర జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం మహాజనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సంఘం రైతుల అభ్యున్నతి కృషి చేస్తుందని అన్నారు. గ్రామాల్లోని రైతులు సొసైటీ కేంద్రాల్లోనే ఎరువులను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. అలాగే తాము పండించిన పంటలను సొసైటీ ఏర్పాటు చేసిన కొనుగోళ్ల కేంద్రాల్లోనే విక్రయించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ అనిల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్లు మఠం చంద్రశేఖర్, కిష్ట్య నాయక్, బాలకృష్ణయాదవ్, మధుసూదన్‌గౌడ్, కృష్ణయ్య, కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



పనులకు శంకుస్థాపన చేస్తున్న హాబేద్

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడలో దర్గా మరమ్మతులకు, ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, ముస్లిం సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటు పడుతున్నారన్నారు. మైనార్టీల అభివద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హాబేద్, జహంగీర్‌సాబ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ శ్రీకాంత్‌గౌడ్, సర్పంచ్‌లు ఈదుల కృష్ణగౌడ్, పెంటయ్య, ఎంపీటీసీ సునిత రామస్వామి, ఉపసర్పంచ్ శ్రీను, సహకార సంఘం మాజీ చైర్మన్లు ఈదుల నర్సింహులుగౌడ్, బండ మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ జోగు వెంకటయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆయూబ్, వడ్డె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో బ్రేక్‌ఫాస్ట్

ప్రభుత్వ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పిల్లల్లో పౌష్టికాహార లోపం అరికట్టేందుకు దసరా నుంచి బ్రేక్‌ఫాస్ట్ పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. ఇందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చింది.

- దసరా కానుకగా ప్రారంభించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- 4,624 మంది విద్యార్థులకు మేలు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

దౌల్తాబాద్: పస్తులతో పాఠశాలలకొచ్చే పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారం అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజనం అందిస్తున్నా.. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉదయం పాఠశాలలకు పస్తులతో వస్తున్నారు. వారికి అల్పాహారంలో సంపూర్ణ పౌష్టికాహారం ఇవ్వాలని నిర్ణయించారు. పేదరికం, ఉదయం ఆలస్యంగా నిద్రలేవడం, తల్లిదండ్రులకు సహాయం చేయడం.. వివిధ పనుల్లో ఉండడం వంటి కారణాలతో విద్యార్థులు ఉదయం ఆహారం తీసుకోలేకపోతున్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం పస్తులకు స్వస్తి పలకనుంది.

కిచిడి.. పొంగల్.. ఉప్మా

విద్యార్థులకు అల్పాహారంలో కిచిడి, పొంగల్, ఉప్మా అందించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం రాగిజావను అందజేస్తున్నారు. దానితో పాటుగా అల్పాహారం అందించడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుంది. మండలంలో 42 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 4,624 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ అక్టోబర్ 24 నుంచి దసరా కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది.

ఆకలికి చెక్



ఉదయం పాఠశాలకు వచ్చే హడావుడిలో తినడం సాధ్యమవ్వడంలేదు. మధ్యాహ్న భోజనం వరకు వేచి చూడాల్సి వస్తుంది. పాఠశాలలో అల్పాహారం అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– శివాజీనాయక్, 10వతరగతి

ఆరోగ్యం మెరుగు



ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకుంటారు. చాలా మంది ఉదయం పస్తులతో వస్తున్నారు. ఈ నూతన పథకంతో వారికి ఆకలి తీర్చవచ్చు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు.

– సోమురాజు, ఉపాధ్యాయుడు, బాలంపేట

ఆరేళ్లయినా.. అక్కడే!

- ప్రకటనలకే పరిమితమైన నిధుల మంజూరు
- నేటికీ ప్రారంభంకాని పనులు

ధారూరు: ఆరేళ్లయినా.. అభివృద్ధి పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. పాలకుల హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో కోట్‌పల్లి చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వరకు 20 మీటర్ల వెడల్పుతో ఫోర్‌లైన్ రోడ్డును, అందులో ఒకటిన్నర మీటర్ల డివైడర్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయడానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని 2018 ఫిబ్రవరిలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రకటించారు. అప్పటి మంత్రులు మహేందర్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, వికారాబాద్ ఎమ్మెల్యే సంజీవరావు సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ, ఎమ్మెల్సీ నిధుల నుంచి మండలానికి మరో రూ.2.07 కోట్లు మంజూరు చేశారని, వీటితో వివిధ అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కానీ నిధుల జాడ లేదు.. నేటికీ పనులు మొదలవ్వలేదు. దీంతో స్థానికులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ధారూరు: సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకుండానే వేసిన రోడ్డు

భర్తను బైక్‌పై వెళ్లమని..

ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం

  

అనిత(ఫైల్) నిహారిక(ఫైల్) రిషిక(ఫైల్)

పహాడీషరీఫ్: ఇద్దరు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కె.మధుసూదన్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం గొల్లోనిపల్లికి చెందిన గోగుల శ్రీను తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఈ నెల 23న తుక్కుగూడలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. 26న స్వగ్రామానికి బయలు దేరారు. దీంతో అనిత(29) తాను కంటి సమస్యతో బాధపడుతున్నాని కూతుర్లు నిహారిక(8), రిషి(5)ని తీసుకుని బస్‌కు వస్తానని.. కుమారుడిని తీసుకుని బైక్‌పై వెళ్లడండని భర్తకు సూచించింది. ఇంటికి చేరకున్న శ్రీను భార్య ఎంతకూ రాలేదు. ఆయన ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యమవ్వక పోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీ షరీఫ్ పీఎస్‌లో గానీ, 87126 62367 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

పోటీకి రెడీ.. నియోజకవర్గం ఏది!

- చేవెళ్లా..? జహీరాబాదా..?
- ఊగిసలాటలో ఏసీఆర్
- ఆందోళనలో అనుచరులు



ఎ.చంద్రశేఖర్

వికారాబాద్: మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ వచ్చే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే విషయంలో ఇంకా సందిగ్ధత వీడడం లేదు. ఆయన నేటికీ ఈ విషయంలో డోలాయమానంలోనే ఉన్నారు. అనేక పార్టీలు మారిన ఆయన చివరకు బీజేపీని వీడి మళ్లీ హస్తం గూటికి చేరిన విషయం విదితమే. ఆయన కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం మొదలైననాటి నుంచి పోటీ చేసే స్థానం విషయంలోనూ ఎన్నో ప్రచారాలు కొనసాగుతున్నాయి. వికారాబాద్ వాస్తవ్యుడైన ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా.. మంత్రిగా ఓ వెలుగు వెలిగారు. కాంగ్రెస్ నుంచి మరో మాజీ మంత్రి బలమైన నాయకుడు గడ్డం ప్రసాద్‌కుమార్ ఉండడంతో ఏసీఆర్ నియోజకవర్గం వీడడం అనివార్యమైంది. ఆయన జహీరాబాద్ లేదా చేవెళ్ల నుంచి బరిలో ఉంటారనే ప్రచారం సాగుతోంది.

పరిచయాలు ఇక్కడ.. ప్రాంతం అక్కడ

కాంగ్రెస్‌లో చేరింది మొదలు ఏసీఆర్ పోటీ చేసే నియోజకవర్గం విషయంలో స్పష్టత ఇవ్వడంలేదు. దీంతో ఆయన అనుచరగనం, అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఆయన పార్టీలో చేరిన తొలినాళ్లలో చేవెళ్ల నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. ఆయన తన సన్నిహితులతోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన కొద్ది రోజులకే ఆయన తల్లిదండ్రులు, తాత ముత్తాతల సొంత నియోజకవర్గం జహీరాబాద్ నుంచి పోటీ చేస్తారనే ప్రచారమూ సాగింది. ఇప్పటికే ఆయన అక్కడ పలుమార్లు పర్యటించారు. కాగా ఏ నియోజకవర్గంలో గెలుపు సునాయాసమనేది తేల్చుకోలేకపోతున్నారు. జహీరాబాద్ సొంత నియోజకవర్గమైనప్పటికీ అక్కడ పెద్దగా పరిచయాలు లేవు. ఆయన రాజకీయ ప్రస్థానం మొత్తం వికారాబాద్ నియోజకవర్గంలోనే సాగింది. దీంతో ఆయన పునరాలోచనలో పడి చేవెళ్ల నుంచే పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని.. తాజాగా పార్టీ పెద్దలతోనూ చర్చించినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. గతంలో వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్న నవాబుపేట మండలం ఇప్పుడు చేవెళ్ల నియోజకవర్గంలో ఉండడం, నవాబుపేట యాదయ్య సొంత మండలమైనా మిగతా మండలాలతో పోలిస్తే ఓటింగ్ సరళి వ్యతిరేకంగా ఉంటూ రావడం.. నవాబుపేట మండలంపై ఏసీఆర్‌కు పూర్తిగా పట్టుండడంతో.. చేవెళ్ల నియోజకవర్గంలోనూ పరిచయాలుండడంతో ఆయనకు చేవెళ్ల నుంచి పోటీ చేస్తేనే గెలుపు అవకాశాలుంటాయని సర్వేలు చెబుతున్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్‌లో ఉన్న రత్నం, ఆయన వర్గం నేతలు యాదయ్యతో అంటీముట్టనట్లు ఉండడం తదితర కారణాల నేపథ్యంలో ఏసీఆర్ తాజాగా చేవెళ్ల నుంచే బరిలో ఉండాలని నిర్ణయించుకుంటున్నట్లు తెలుస్తోంది.

పార్టీలు మారినా దక్కని ఫలితం

మూడున్నర దశాబ్దాల క్రితం ఎన్టీఆర్ హయాంలో వికారాబాద్ నుంచి రాజకీయ ప్రవేశం చేసిన ఏసీఆర్ మళ్లీ తిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఆయన 2008 వైఎస్ హయాంలో జరిగిన ఉప ఎన్నికలో ప్రసాద్‌కుమార్ చేతిలో ఓటమి చవి చూశారు. తరువాత 15 ఏళ్ల పాటు ఆయన ప్రతీ ఎన్నికలో ఓటమి తప్పలేదు. దీంతో ఆయన ఒక్క గెలుపు కోసం పరితపిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్ని పార్టీలు మారినా గెలుపును అందుకోలేకపోయారు. బీజేపీలోనూ గెలుపు సాధ్యం కాదని భావించి ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మళీ ఏదో ఒక నియోజకవర్గం నుంచి గెలుపొంది ఫామ్‌లోకి రావాలని చూస్తున్నారు.

ఆయన సేవలు యువతకు ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి
- విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ యువతకు ఆదర్శమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అందజయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలీయుల బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో నిజాం సర్కారుతో, రజాకారులతో పోరాడిన గొప్ప వ్యక్తి కొండాలక్ష్మణ్‌బాపూజీ అన్నారు. ఉద్యమం కోసం ఆనాడే తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. పద్మశాలీయులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎం.ఎస్.నటరాజ్, కో ఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్, కమిషనర్ వెంకన్న, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోటజనార్దన్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఇప్పలపల్లి లక్ష్మి, సభ్యులు మౌనిక, అరుణ, నాయకులు అగ్గనూరు విశ్వం, నారాయణరెడ్డి, శ్రీశైలంగౌడ్, నందకిషోర్, చెన్నయ్య, నర్సింలు, కృష్ణయ్య, రామస్వామి, రాములు, పూర్ణ, రమేష్, శివ, దాసరమేష్, బాలు, చెన్నబాలరాజు, రాజేందర్, అంజయ్య, హరి, రాజు, భాస్కర్, సుంకూరు నరేందర్, ఇస్నగారి శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు విధిగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలి

రాష్ట్ర ఎయిడ్స్, హెచ్ఐవీ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ నర్సింహారెడ్డి

షాద్‌నగర్: ప్రతి గర్భిణికి విధిగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ఎయిడ్స్, హెచ్ఐవీ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ నర్సింహారెడ్డి వైద్యులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పాజిటివ్ వచ్చిన వారికి ఏఆర్టీ మందులు అందజేస్తున్నారా లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ పాజిటివ్ కేసులు ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయో అక్కడ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అన్నారు. గర్భిణికి హెచ్ఐవీ ఉన్నట్లయితే విధిగా ఏఆర్టీ చికిత్స కోసం మందులను అందించాలన్నారు. దీంతో పుట్టబోయే బిడ్డకు వ్యాధి సంక్రమించకుండా ఉంటుందన్నారు. హెచ్ఐవీ బారిన పడిన వారి కి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మనో ధైర్యం నింపాలన్నారు. ఐసీటీ కేంద్రాల్లో సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీశైలం, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఐసీటీ కేంద్రం కౌన్సిలర్ శ్యాం సుందర్, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సత్తా చాటాలి



చాకల్‌పల్లి ముదిరాజ్ సంఘం నేతలు

సంఘం నాయకుడు మాణయ్య

కుల్కచర్ల: ముదిరాజ్‌ల సత్తా చాటాలని సంఘం నాయకుడు మాణయ్య ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లి, కొత్తపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో సంఘం నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 1న పరిగి పట్టణంలో పండుగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, రామకృష్ణ, కల్యాణ్, నరేశ్, రాజు, నర్సింలు, విజయ్, చెన్నయ్య, సుధాకర్, శ్రీనివాస్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వం

కొందుర్గు: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకాలను మండలంలోని ముట్పూర్‌లో బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ గౌడ్, రవి, అంజయ్య, నర్సింలు, ద్విజేందర్, శ్రీను, రాజు, మల్లయ్య పాల్గొన్నారు.

చౌదరిగూడలో..

మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటనర్సింహ రెడ్డి, వేణుగోపాల్, అజ్జు, అన్వర్, మసూద్, సలీం, దామోదర్ పాల్గొన్నారు.



కొందుర్గు: ముట్పూర్‌లో ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడలతో ఆరోగ్యం

జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్



విజేతలకు బహుమతులు అందజేసిన శ్రీకాంత్

మొయినాబాద్: క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్ అన్నారు. పెద్దమంగళారంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. విద్యార్థి దశ నుంచి క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్ రజినీదీప, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ డప్పు రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న సర్కార్

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: నిరుద్యోగులను కేసీఆర్ సర్కార్ మోసం చేస్తోందని కాంగ్రెస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలో డీఎస్సీ అభ్యర్థులు నిరసన చేపట్టారు. ఎన్టీఆర్ చౌరస్తాలో చేపట్టిన ఈ కార్యక్రమానికి సుధాకర్‌రెడ్డి హాజరై ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ వేయాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ మురళి, నాయకులు రెడ్యా నాయక్, శ్రీనివాస్ ముదిరాజ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీకి రాజకీయ రంగు

- బీఆర్ఎస్ నేతలు పెత్తనం చేస్తున్నారంటూ సభ్యుల ఆగ్రహం
- డైరెక్టర్ల ఎన్నికలు ఎందకు నిర్వహించలేదని నిలదీత



చైర్మన్‌ను నిలదీస్తున్న సభ్యులు

హయత్‌నగర్: నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మాక్) మదర్ డెయిరీ రాజకీయ రంగు పులుముకుంది. హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాలులో బుధవారం నార్మాక్ మదర్ డెయిరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతుండగా కొందరు సభ్యులు అడ్డు తగిలారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి డైరెక్టర్ల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని నిలదీశారు. ఎన్నికలు లేకండా సర్వసభ్య సమావేశం ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతోనే ఎన్నికలు నిర్వహించలేదని వాదనకు దిగారు. దీంతో చైర్మన్ తన ప్రసంగాన్ని పూర్తి చేయకుండానే వేదికపై నుంచి దిగిపోయారు.

బీఆర్ఎస్ నాయకుల పెత్తనం ఎక్కువైంది..

ప్రశాంతంగా ఉన్న మదర్ డెయిరీలో బీఆర్ఎస్ నాయకుల పెత్తనం ఎక్కువైందని, జిల్లా మంత్రి జోక్యంతో ఎన్నికలు నిర్వహించలేదని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య అన్నారు. 18 గ్రామీణ స్థాయి చైర్మన్ల ఎన్నికలు జరపలేదని దానిని సాకుగా చూపి డైరెక్టర్ల ఎన్నికలు నిర్వహించలేదని విమర్శించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ఎన్నికలు జరగకుండా చేస్తున్నారని ఆరోపించారు.

పాడి రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాం

ఈ సందర్భంగా నార్మాక్ మదర్‌డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. డెయిరీ కి అధికంగా పాలు పోసే రైతులకు ప్రైవేటు డెయిరీలకంటే అధిక ధర చెల్లిస్తున్నామని,సభ్యత్వం ఉన్న రైతులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.పది వేలు ఇస్తున్నామని,మృతిచెందిన గేదెకు ఇన్సూరెన్స్ రూ.80 వేలకు పెంచుతున్నట్లు చెప్పా రు. ఓటరు లిస్టులో లోపాలున్నాయని, వాటిని సరి చేయాలని కొందరు సభ్యులు అభ్యంతరం తెలిపినందున ఎన్నికల అధికారి డైరెక్టర్ల ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. ఓటరు లిస్టు సరి చేసి ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.